# 2017, మార్చి 13వ తేదిన తెలంగాణ రాష్ట్ర శాసనసభకు 2017-18 సంవత్సరం బడ్జెట్‌ను సమర్పిస్తూ గౌరవనీయులైన ఆర్థిక మంత్రి శ్రీ ఈటల రాజేందర్ గారి ప్రసంగం.

***గౌరవనీయ అధ్యక్షా!***

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రానికి వరుసగా నాలుగవసారి బడ్జెట్‌ను నా చేతుల మీదుగా ప్రవేశపెట్టే అవకాశం లభించడం నా భాగ్యమని భావిస్తున్నాను. నాపై విశ్వాసంతో ఈ గొప్ప బాధ్యత అప్పగించినందుకు గౌరవనీయులైన ముఖ్యమంత్రి శ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గారికి కృతజ్ఞుడిని. నాపై చూపించిన ఈ నమ్మకానికి తగిన ట్టుగా బాధ్యత నిర్వహించడం నా కర్తవ్యం. గత మూడు బడ్జెట్ ల మాదిరిగానే, ఈ బడ్జెట్ కూడా పేదల సంక్షేమం పట్ల, రాష్ట్ర ఆర్థికాభివృద్ధి పట్ల గౌరవనీయ ముఖ్యమంత్రి గారికి ఉన్న శ్రద్ధాసక్తులను ప్రతిబింబిస్తుంది.

2. ఉమ్మడి రాష్ట్రంలో అన్ని రంగాలలో నిర్లక్ష్యానికి గురైన ఆర్థిక వ్యవస్థను చక్కది ద్దుతూ, ఎంతో కాలంగా అణగారిన ప్రజల ఆకాంక్షలను తీరుస్తూ, తెలంగాణ గత వైభ వాన్ని పునరుద్ధరించే బృహత్ బాధ్యతను తెలంగాణ ప్రజలు మా ప్రభుత్వంపై మోపారు. ఉమ్మడి రాష్ట్రంలో యాభై ఎనిమిది చీకటి సంవత్సరాలు అనుభవించిన తెలంగాణ ప్రజలు, సొంత రాష్ట్రంలోనే తమకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భావించారు. మా ప్రభుత్వంపై ప్రజలు కలిగి వున్న విశ్వాసానికి అనుగుణంగా నిలవాలనేదే మా నిరంతర ప్రయత్నం. కొత్త రాష్ట్రం ఏర్పడగానే, వనరులపై అస్పష్టత, పరిపాలనా యంత్రాంగాన్ని గాడిలో పెట్టడం, రెండు రాష్ట్రాల మధ్య సిబ్బంది పంపిణీ వంటి అనేక సమస్యలు ఎదు రయ్యాయి. రాష్ట్ర ఆర్థిక స్థితి పైన, వనరుల పైన, పేదల దీన స్థితిని తొలగించడానికి చేప ట్టవలసిన శాశ్వత పరిష్కారాలపైన పేదలు మానవీయమైన, గౌరవప్రదమైన జీవనం సాగించడానికి గల అవకాశాల పైన మాకిప్పుడు పూర్తి అవగాహన ఏర్పడింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి ముఖ్యమంత్రిగారి నేతృత్వంలో మా ప్రభుత్వం చేపట్టిన క్రి యాశీల విధానాల వల్ల రెవెన్యూ వృద్ధి అమితంగా ఉందని గౌరవ సభ్యులకు తెలుపడానికి

సంతోషంగా ఉన్నది. ఆర్థిక వృద్ధికి గల అన్ని అవకాశాలను ప్రభుత్వం సమర్థవంతంగా ఉపయోగించుకుంటున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి ఎనిమిది నెలల్లో పన్నుల ద్వారా సమకూరిన రాష్ట్ర ఆదాయం 19.61 శాతం వృద్ధి రేటుతో దేశంలోని చాలా రాష్ట్రాల కన్నా ఎక్కువగా ఉంది. పెద్ద నోట్ల రద్దు వల్ల స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గినప్పటికీ, ఇతర పన్నుల ద్వారా సమకూరే ఆదాయం పెరగడం గమనార్హం. ఎంతో జాగ్రత్తగా తీర్చిదిద్దడం వల్లనే మన ఆర్థిక వ్యవస్థ ఇంతటి దృఢత్వాన్ని సంతరించుకున్నది.

3. ప్రజలే కేంద్రంగా ప్రజా సమస్యలే ఇతివృత్తంగా పాలన సాగాలని ముఖ్యమంత్రి గారు మాకు నిరంతరం మార్గ నిర్దేశనం చేస్తున్నారు. దానికి అనుగుణంగానే అభివృద్ధి ఫలాలు అట్టడుగు వర్గాలకు అందాలనే ఆరాటం మా ప్రణాళికలో అడుగడుగున ప్రస్ఫుటమవుతుంది.

4. రాష్ట్ర అవతరణ నాటినుంచి పేదల సంక్షేమమే పరమావధిగా, పారదర్శకమైన, ప్రజానుగుణమైన పరిపాలన సాగించడానికి మా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. మా ప్రభుత్వానికి ప్రజలే ప్రభువులు, వారికోసం పని చేయడమే మా కర్తవ్యం.

**2017-18 బడ్జెట్ రూపకల్పనలో మార్పులు:**

5. బడ్జెట్ రూపకల్పనలో ఈ సారి భిన్న పద్ధతి అవలంబించాం. సహజంగా బడ్జెట్‌ను ప్రణాళిక, ప్రణాళికేతర పద్దుల క్రింద చూపిస్తాం. దీనికి బదులుగా రెవెన్యూ, క్యాపిటల్ పద్దుల క్రింద బడ్జెట్ రూపకల్పన జరగాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాలను రాష్ట్రాలు తప్పకుండా పాటించాల్సి ఉంది. దీనికి అనుగుణంగానే మన బడ్జెట్ ప్రతిపాదనను కూడా రూపొందించాం. అకౌంటింగులో కూడా కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సూచనలకు అనుగుణంగా కేంద్రం, రాష్ట్రాలు ఏకరూప విధానాన్ని అనుసరిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా ఏక రీతిన వుండడం కోసం మా ప్రభుత్వం కూడా ఈ కొత్త పద్ధతిని చేపట్టింది. బడ్జెట్ వర్గీకరణలో కొత్త విధానాన్ని చేపట్టడం వల్ల, కేంద్ర ప్రభు

త్వం, పంచ వర్ష, వార్షిక ప్రణాళికల స్థానంలో పదిహేనేండ్ల దార్శనికత, ఏడేండ్ల వ్యూహం, మూడేండ్ల కార్యాచరణ ప్రణాళికలు ప్రవేశపెట్టడమైనది. నిజానికి ఈ పరిణామం "మీ జిల్లాను తెలుసుకోండి, మీ జిల్లా ప్రణాళికను రూపొందించుకోండి" అనే ప్రభుత్వ విధానాన్ని బలోపేతం చేస్తుంది. 73వ, 74వ రాజ్యాంగ సవరణ చేసినప్పటికీ కాగితాలకే పరిమితమైన ప్రణాళిక వికేంద్రీకరణ లక్ష్యం దీనివల్ల నెరవేరుతున్నది. బడ్జెట్ రూపకల్పనలో వచ్చిన ఈ మార్పులన్నింటినీ, శ్రీ ఎస్.రామలింగారెడ్డి గారి ఆధ్వర్యంలోని అంచనాల కమిటీ నిశితంగా పరిశీలించి, ఆమోదించినది.

6. పతనమైన ఆర్థిక వ్యవస్థ నుంచి ప్రజల సుదీర్ఘ ఆకాంక్షలు తీర్చే దిశగా తెలంగాణ భారీ పరివర్తన దశలో వున్నది. తెలంగాణ భవిష్యత్తు చిత్రాన్ని ఊహించుకున్నప్పుడు అభివృద్ధి ప్రాతిపదికలు మారాయి అని, ఇంకా మారుతూనే వుంటాయని తెలుస్తుంది. గొప్ప పాలనాధ్యక్షుడు ఎడ్మండ్ బర్క్ చాలా కాలం క్రిందటే చెప్పినట్టు-"మనమంతా పరివర్తనా సూత్రాన్ని అంగీకరించవలసిందే. పరివర్తన అనేది శక్తివంతమైన ప్రకృతి సూత్రం". ప్రగతి పథంలో ప్రయాణమనేది ఒక్కటే తెలంగాణలో శాశ్వతమైన సత్యం. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, టి.ఎస్-ఐపాస్, నిర్ణీత వ్యవధిలో కోటి ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలిగించడం వంటి ప్రభుత్వం చేపట్టిన పథకాలు ఏవైనా కావచ్చు, ఇవన్నీ ఊహాతీతంగా అభివృద్ధిని ఎల్లలు దాటి విస్తరింపచేసేవే. వచ్చే కొన్నేండ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చేందే రాష్ట్రాల సరసన నిలబెట్టేవే.

7. బడ్జెట్ రూపకల్పనలో మార్పులు వచ్చిన నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికలో కూడా మార్పులు అనివార్యం అవుతాయి. ఎస్సీ, ఎస్టీ లకు బడ్జెట్ కేటాయింపులు ఎలా వుండాలనే విషయం చర్చించి, ప్రభుత్వానికి సూచనలు చేయడానికి ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రుల ఆధ్వర్యంలో కమిటీలను ముఖ్యమంత్రి నియమించారు. ఆయా వర్గాలకు చెందిన శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, ఎం.పి. లతో సి.ఎం. ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీ, ఎస్టీ కమిటీ సిఫారసుల మేరకు ఆయా వర్గాలకు జనాభా నిష్పత్తి ప్రకారం విధిగా నిధుల కేటాయింపులు ఉండే వి

ధంగానే అంచనాలు రూపొందించాము. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీ ల కోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఎస్సీ, ఎస్టీ ల స్పెషల్ డెవెలప్‌మెంట్ ఫండ్ లోని నిధులు ఒక ఏడాది వ్యయం కాకపోతే, వాటిని తదుపరి సంవత్సరానికి క్యారీఫార్వార్డ్ పద్ధతిలో బదిలీ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమం పట్ల పూర్తి నిబద్ధత కలిగిన మా ప్రభుత్వం ఈ అసాధారణమైన నిర్ణయం తీసుకున్నది.

8. గతంలో ఉప ప్రణాళికల క్రింద గల బడ్జెట్ వ్యయంపై దృష్టి సారించి, నిర్ణీత వ్యవధిలో సమీక్షించకపోయేవారు. దీని వల్ల నిధులు పూర్తిగా వ్యయం కాకపోయేవి. కానీ కొత్త చట్టం ఇందుకు భిన్నమైనది. కొత్త చట్టం ప్రకారం–నిర్ణీత కాలానికి పథకాలవారీగా సమీక్ష జరిపి, మూడు నెలలకు ఒకసారి అసెంబ్లీలో, శాసన మండలి లో నివేదికలు ప్రవేశపెట్టవలసి ఉంటుంది. ఈ విధానం మా ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని సూచిస్తున్నది. ఎస్సీ, ఎస్టీ అభివృద్ధికోసం వారి జనాభాకు అనుగుణంగా బడ్జెట్ నిధులు కేటాయించ డంతో బాధ్యత తీరిపోదని, వాటిని పూర్తి స్థాయిలో ఉపయోగించే విధంగా కూడా జాగ్ర త్తలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద ఈసారి బడ్జెట్ లో రూ.14,375.12 కోట్లను, ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.8,165.88 కోట్లను కేటాయిస్తున్నాము.

9. 2016 నవంబర్ 8 న పెద్ద నోట్లను రద్దు చేయడం 2017–18 సంవత్సర బడ్జె ట్‌పై అమిత ప్రభావాన్ని చూపింది. ఇది స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ విభాగం వసూళ్లను దెబ్బతీసింది. కొంత మేరకు వ్యాట్ రెవెన్యూను కూడా తగ్గించింది. అయితే నగదు లావాదేవీలు తగ్గించిడానికి తగిన చర్యలు తీసుకున్నట్లయితే పన్నుల వసూలు మెరుగు పడుతుందని, కేంద్రం నుంచి పన్నుల రాబడి కూడా మెరుగు పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావంతో ఉన్నది. 2017 జులై నుంచి అమలయ్యే గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జి.ఎస్.టి) ప్రభావం పై కూడా కొంత అనిశ్చితి ఉన్నది.

10. ఈ బడ్జెట్‌పై మన ముఖ్యమంత్రి ముద్ర స్పష్టంగా కనిపిస్తుంది. పేదల సంక్షేమం పట్ల ఆపేక్షతో పాటు ఆదాయాన్ని పెంచే అవకాశాలు, ఉపాధి కల్పిస్తూ బంగారు

తెలంగాణను సాధ్యమైనంత తొందరగా సాధించాలన్న ఆయన ఆకాంక్షను ఈ బడ్జెట్ ప్రతిబింబిస్తున్నది.

**రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ:**

11. రాష్ట్ర స్థూల ఆర్థిక పరిస్థితిని గౌరవ సభ్యులకు వివరించడం ఆనవాయితీ. 2014 జూన్ లో రాష్ట్రం ఆవిర్భవించిన నాటినుంచి ఆర్థికంగా అభివృద్ధి గమనం ఎదుగుదల దిశగా సాగుతూనే ఉండడం సంతృప్తిని కలిగిస్తున్నది. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జి.ఎస్.డి.పి) వృద్ధి స్థిర (2011-12)ధరలవద్ద 2013-14 లో 5.7 శాతం నుంచి 2014-15 లో 8.6 శాతానికి, 2015-16 లో మరింతగా 9.5 శాతానికి మెరుగుపడ్డది. తాజా అంచనాల ప్రకారం జి.ఎస్.డి.పి. వృద్ధి 2016-17 లో స్థిర ధరలవద్ద డబుల్ డిజిట్‌కు 10.1 శాతానికి పెరగవచ్చు. ఇదే కాలంలో జాతీయ జి.డి.పి. వృద్ధి 7.1 శాతం ఉంటుందని అంచనా.

12. పెద్ద నోట్ల రద్దు ప్రభావం ఆర్థిక కలాపాలను దెబ్బతీసిన తరువాత కూడా రాష్ట్రం డబుల్ డిజిట్ వృద్ధిని సాధించడం ఎంతో సంతృప్తికరమైన అంశం. 2014-15, 2015-16 లో వర్షాభావ పరిస్థితులవల్ల వ్యవసాయ అనుబంధరంగాలలో 9.5 శాతం మరియు 6.3 శాతం వృద్ధిరేటు కుంటుపడినప్పటికి మొత్తంమీద మన ఆర్థికరంగం రెండు అంకెల వృద్ధిరేటును సాధించగలగటం గమనార్హం. 2012-13 లో, 2013-14 లో జాతీయాభివృద్ధి కన్నా మన వృద్ధిరేటు తక్కువగా ఉన్నప్పటికీ, రాష్ట్రావతరణ తరువాత గత మూడేండ్లలో జి.ఎస్.డి.పి జాతీయ సగటు కన్నా ఎక్కువగా ఉన్నది.

13. విద్యుత్ సరఫరా మెరుగుపడడం, ప్రభుత్వ క్రియాశీల విధానాల మూలంగా పారిశ్రామికరంగం అభివృద్ధి చెప్పుకోదగినంతగా ఉన్నది. 2013-14 లో 0.6 శాతం నుంచి 2016-17 లో 7.5 శాతానికి చేరుకున్నది. రుతుపవనాలు కొంచెం ఆలస్యంగా వచ్చినా, వర్షపాతం సాధారణం కన్నా ఎక్కువగా ఉండటం వల్ల వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధి ఈ సంవత్సరంలో 12.1 శాతానికి చేరుకుంటున్నది. ఈ ఏడాది

కూడా సమృద్ధిగా వానలు కురవాలని, పంటలు బాగా పండాలని అందరం కోరు కుందాం.

14. మొత్తానికి జి.ఎస్.డి.పి. ప్రస్తుత ధరల ప్రకారం-గత ఏడాది 5,75,631 కోట్లు ఉండగా, 2016-17 లో 6,54,294 కోట్లు ఉంటుందని అంచనా. ఇది గత ఏడా దితో పోలిస్తే రికార్డు స్థాయిలో 13.7 శాతం అభివృద్ధి. రాష్ట్ర తలసరి ఆదాయం 2015-16 లో 1,40,683 రూపాయలు ఉండగా, ఈ ఏడాది 1,58,360 రూపా యలకి పెరుగుతుందని అంచనా. 2016-17 రాష్ట్ర తలసరి ఆదాయం జాతీయ సగటు 1,03,818 రూపాయల కన్నా ఎక్కువ. జాతీయ సగటు కన్నా తక్కువ ఉన్న తలసరి ఆదాయ వార్షిక వృద్ధి, రాష్ట్రావతరణ తరువాత పెరగడం మొదలై ఇప్పుడు జాతీయ సగ టును మించిన వేగంతో పెరుగుతున్నదని గౌరవ సభ్యులకు చెప్పడానికి సంతోషంగా ఉన్నది. జాతీయ స్థాయి వార్షిక తలసరి ఆదాయవృద్ధి 2013-14 లో 11.5 శాతం ఉండగా 2016-17 లో 10.2 శాతానికి తగ్గింది. కాగా ఇదే కాలంలో తెలంగాణలో 11.2 శాతం నుంచి 12.6 శాతానికి పెరిగింది.

15. తెలంగాణ ఏర్పడిన తరువాత రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చెప్పుకోదగిన స్థాయిలో పున రుద్ధరణ పొందడం చూస్తే, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ నిర్లక్ష్యానికి గురైందనే విషయం రుజువవుతున్నది. సాగునీరు, వనరులు, ఉద్యోగాలు-నీళ్లు, నిధులు, నియామకాలపై తెలంగాణకు పూర్తి పట్టు ఉండడం వల్ల రాష్ట్రం తన శక్తి సామర్థ్యాలన్నీ వినియోగించు కొని ఎల్లలు దాటిన అభివృద్ధిని చవిచూస్తుంది. ప్రజల పట్ల నిర్లక్ష్య విధానం నుంచి ప్రజా కేంద్ర విధానాల వైపు, నైరాశ్యం నుంచి ఆశావాహ పరిస్థితి వైపు, వనరుల నిరుపయోగం నుంచి ఎల్లలు దాటిన అభివృద్ధి వైపు, కరువు పీడిత వ్యవసాయం నుంచి కరువును అధిగమించే సాగువిధానం వైపు మూడేండ్లు కూడా నిండకముందే నిర్ణయాత్మకంగా ముందడుగు వేశాం.

**భారీపాలనా సంస్కరణ:**

అధ్యక్షా,

16. పరిపాలనా విభాగాలు చిన్నవిగా ఉన్నప్పుడే సామాన్యులకు న్యాయం జరుగు తుందనే అంబేద్కర్ మహాశయుని తాత్విక చింతనను సూక్ష్మస్థాయిలో ఆచరించే దిశగా మా ప్రభుత్వం అడుగులు వేసింది. అధికార వికేంద్రీకరణ, పరిపాలనా సౌలభ్యం, ప్రజలకు సౌకర్యం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం భారీ పాలనా సంస్కరణలు తీసుకొచ్చింది. భౌగోళిక సామీప్యం, సాంస్కృతిక ఐక్యత, స్థానిక వనరుల సమర్ధ విని యోగం అనే మూడు ప్రాతిపదికల ఆధారంగా జిల్లాల పునర్వ్యవస్థీకరణను చేపట్టింది. తెలంగాణ 10 జిల్లాలను పునర్వ్యవస్థీకరించి 31 జిల్లాలను ఏర్పాటు చేసింది. కొత్త జిల్లాలతో పాటు 25 కొత్త రెవెన్యూ డివిజన్లు, 125 కొత్త మండలాలు, 5 కొత్త పోలీస్ కమీషనరేట్లు, 23 కొత్త పోలీస్ సబ్ డివిజన్లు, 28 సర్కిల్ కార్యాలయాలు, 94 కొత్త పోలీస్ స్టేషన్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సామాన్యుల ముంగిట్లోకి పాలన రావాలనే లక్ష్యానికి పరిపాలన విభాగాల పునర్వ్యవస్థీకరణ దోహదం చేసింది. జిల్లా కేంద్రాల్లో కూడా అన్ని కార్యాలయాలు ఒకే దగ్గర నిర్మించాలని ప్రభుత్వం భావిస్తుంది.

**బడ్జెట్ -2017-18**

**అధ్యక్షా,**

17. ఇప్పుడు 2017-18 బడ్జెట్ కేటాయింపుల ప్రధానాంశాలను వివరిస్తాను.

**నిర్వహణ పద్దు:**

18. రెవెన్యూ పద్దుల కింద ఉన్న వ్యయం ప్రధానంగా నిర్దేశితమైనది. ఇది అని వార్యంగా పెట్టాల్సిన ఖర్చు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగస్తుల వేతనాలు, పించన్లు, కార్యా లయ ఖర్చులు, నిర్వహణ ఖర్చులు, వడ్డీ చెల్లింపులు, ఇతర హామీలు, అప్పులు మొద లైనవి ఉంటాయి. ఇందుకోసం రూ.50,954.61 కోట్లు కేటాయించడమైంది. దీనికి

అదనంగా రూ.4,659.48 కోట్లు రుణ చెల్లింపుల కోసం, రూ.5,544.85 కోట్లు రుణాలు, అడ్వాన్సుల కోసం పెట్టుబడి వ్యయం రూ.448.26 కోట్లు కేటాయించాం. ఈ విధంగా 2017-18 లో నిర్ధేశిత నిర్వహణ వ్యయం రూ.61,607.20 కోట్లు గా ఉంటుంది. నిర్దేశిత వ్యయం కేటాయింపుల తరువాత మిగిలేది 'ప్రగతి పద్దు'.

**వ్యవసాయం అనుబంధ రంగాలు:**

19. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు మా ప్రభుత్వం అమితమైన ప్రాధాన్యం ఇస్తున్నది. వ్యవసాయ రంగంపై దాదాపు యాభై శాతం రాష్ట్ర జనాభా ఆధారపడి ఉన్నప్పటికీ, జి.ఎస్.డి.పి కి దీని ద్వారా వచ్చి చేరేది 14.7 శాతం నుంచి 18.3 శాతం మాత్రమే. దీనిని బట్టి సాగు రంగంలో ఆదాయం ఎంత తక్కువగా ఉన్నదో తెలుస్తున్నది. రైతులకు తక్షణ తోడ్పాటు అందించడం, వ్యవసాయ రంగాన్ని కరువును అధిగమించేదిగా మలచి రైతుల సమస్యల శాశ్వత పరిష్కారానికి మా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకున్నది. రైతుల పంట రుణాలమాఫీ ఈ ఏడాదితో వంద శాతం పూర్తవుతుంది. ఇప్పటికే మూడు విడతల రుణమాఫీ జరిగింది. ఈ ఏడాది నాలుగోది, చివరిదీ అయిన కిస్తును కూడా చెల్లిస్తున్నాం. ఈ ఏడాది నాలుగవ విడత రుణమాఫీ చెల్లించడానికి రూ.4,000 కోట్లను కేటాయించాం.

20. సాయిల్ హెల్త్ కార్డ్స్ జారీ చేయడం ఇప్పటికే మొదలైంది. వచ్చే ఏడాది మరింత ఉధృతంగా సాగిస్తాం. రైతులను ఫసల్ భీమా యోజన కింద చేర్చడం వచ్చే ఏడాది మరింతగా ఉంటుంది. తెలంగాణను విత్తన భాండాగారంగా మార్చి, క్రాప్ కాలనీలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రయత్నాలను కొనసాగిస్తున్నది. తెలంగాణ భూభౌతిక వాతావరణ స్థితికి అనుగుణంగా సేద్య విధానాన్ని తీర్చిదిద్దుతున్నాం. 2017 లో బ్యాంకుల ద్వారా వ్యవసాయ రంగానికి ఋణాల వితరణ లక్ష్యాన్ని రూ.46946.98 కోట్లుగా నిర్ణయించాం. వ్యవసాయ రంగానికి మొత్తం కేటాయింపు రూ.5942.97 కోట్లు కేటాయిస్తున్నాం.

**తోటల పెంపకం**

21. 2016-17 బడ్జెట్‌లో చెప్పినట్లుగా పంట సేకరణ, నిలువ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలు పెంచడానికి హార్టికల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నెల కొల్పాం. పాలి హౌజ్, మైక్రో ఇరిగేషన్ పథకాలకు సబ్సిడీలు ఇచ్చి పటిష్టం చేస్తాం. మైక్రో ఇరిగేషన్ పథకాలకు చేసే వ్యయాన్ని బడ్జెటేతర వనరుల ద్వారా ఖర్చు పెట్టడానికి ప్రతిపాదించడమైనది.

**మార్కెటింగ్**

22. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కొరకు రాష్ట్రంలో 17.07 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 330 అదనపు గోదాంలను 1024.50 కోట్ల వ్యయంతో నిర్మించడం జరుగుతున్నది. వీటిలో 321 గోదాంల నిర్మాణం మొదలుపెట్టి 9.8 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన 202 గోదాంల నిర్మాణం ఇప్పటికే పూర్తి అయింది.

**నీటిపారుదల:**

23. తెలంగాణలో కోటి ఎకరాలకు నీరందించడం లక్ష్యంగా ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నది. గోదావరి, కృష్ణ నదులపై 23 మేజర్, 13 మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందులో 7 ప్రాజెక్టుల నిర్మాణం పూర్తయింది. మరో 14 పాక్షికంగా పూర్తయ్యాయి.

24. రికార్డు సమయంలో పూర్తి చేసిన ఖమ్మం జిల్లాలోని కరువు పీడిత ప్రాంతమైన పాలేరులో భక్తరామదాసు ఎత్తిపోతల పథకాన్ని ఇటీవలే ముఖ్యమంత్రి గారు ప్రారంభించారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని కూడా శరవేగంగా పూర్తి చేసి నాలుగున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు ఈ ఏడాది సాగునీరు అందించాం. ఇదే స్ఫూర్తితో నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం సన్నద్ధంగా

ఉంది. మిషన్ కాకతీయ ద్వారా చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం నడుస్తున్నది. ఇప్పటికే రెండు దశల పనులు పూర్తయ్యాయి. త్వరలో మూడో దశ ప్రారంభం కానున్నది. సాగునీటి రంగానికున్న ప్రాధాన్యత దృష్ట్యా ఈ ఏడాది బడ్జెట్లో ఈ శాఖకు 25 వేల కోట్లు కేటాయించాం.

25. అలాగే గౌరవ ముఖ్య మంత్రి ఆదేశాలతో నా నేతృత్వంలోని కమిటి అహ్మదాబాదులోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును సందర్శించింది. ఆ నమూనాలో కరీంనగర్‌లో లోయర్ మానేరు డ్యామ్ దిగువన మానేరు రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును రూ.506 కోట్లతో చేపట్టడానికి నిర్ణయించాం. ఈ బడ్జెట్‌ను నీటి పారుదల శాఖ ద్వారా కేటాయిస్తున్నాం. ఈ సంవత్సరంలో రూ.193 కోట్లు కేటాయిస్తున్నాం.

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పరిపుష్టత:**

26. తెలంగాణది ఒక ప్రత్యేకమైన గ్రామీణ ఆర్థిక వ్యవస్థ. ఇక్కడి వనరుల ఆధారంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వివిధ సామాజిక వర్గాలకు ప్రత్యేకమైన జీవిక ఏర్పడింది. వ్యవసాయంతో పాటు అనేక అనుబంధ వృత్తులను ఆశ్రయించి ప్రజలు జీవనం సాగిస్తున్నారు. ఉత్పత్తి కేంద్రంగా ఉండే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పదిలంగా ఉన్నంత వరకు తెలంగాణ పల్లెలు స్వయం పోషకత్వంతో, సమృద్ధితో ఉన్నాయి. సమైక్యపాలనలో తెలంగాణ జీవన పరిస్థితులు విచ్ఛిన్నమయ్యాయి. వ్యవసాయం పట్ల నిర్లక్ష్యం, కులవృత్తుల పట్ల అనాదరణ కారణంగా గ్రామీణ జీవితం అల్లకల్లోలమయింది. వృత్తి నైపుణ్యం కలిగిన తెలంగాణ బిడ్డలు పొట్ట చేతపట్టుకొని పట్టణాలు, పరదేశాలకు వెళ్ళి బతకాల్సిన దుస్థితిలోకి నెట్టివేయబడ్డారు. ఈ రోజు మా ప్రభుత్వం బ్యాలెట్ బాక్స్ బడ్జెట్‌గా కాకుండా బతుకును నిలబెట్టే బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేయడం ద్వారానే తెలంగాణ ఆర్థికవృద్ధి ఎదుగుదల దిశగా పయనిస్తుందని మేము ప్రగాఢంగా విశ్వసిస్తున్నాం. ఇందుకనుగుణంగా గ్రామీణ వృత్తులకు ఆర్థిక ప్రేరణనిచ్చే పథకాలను రూపొందించాం.

27.  పరిణత దృక్పథంతో పరిశీలిస్తే, తెలంగాణాలో అపారమైన మానవ సంపద ఉన్నదని గ్రహించ గలుగుతాం. కులవృత్తులు ఆధారంగా జీవనం గడుపుతూ  అను వంశికంగా విశేషమైన వృత్తి నైపుణ్యం పొందిన సామాజిక వర్గాలు ఉండడం తెలంగా ణాకు గొప్ప వరం. వారి నైపుణ్యానికి తగిన పనిని, ఆదరణ ను, ప్రేరణను ఇస్తే వారు తెలంగాణాకు తరగని సంపద సృష్టించి ఇస్తారు. ఇన్నాళ్లూ వీళ్ల సామర్థ్యాన్ని  వినియో గించుకోకుండా నిర్లక్ష్యం చేసారు. ఎండమావులను లక్ష్యం చేసుకున్న గత పాలకులు తమ విధానాలతో చేతి వృత్తుల చేతులు విరిచేశారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేశారు. గ్రామాలు మొండి గోడల మీద మొలచిన చెట్లతో బీడు బడిన భూములతో బావురుమనేట్లు చేశారు. గ్రామీణ జీవితం మీద అలుముకున్న ఈ విషా దాన్ని తొలగించి పల్లెల ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని సుందరతరంగా, సుసంపన్నంగా మార్చే విధానానికి మా ప్రభుత్వం నాంది  పలుకుతున్నది.

**గొర్రెల పెంపకం:**

28.  కాల పరీక్షకు తట్టుకుని నిలబడడమే కాకుండా ఎంతో లాభసాటిగా ఉన్న కుల వృత్తులను ప్రభుత్వం గుర్తించింది. పశు సంవర్ధక రంగం, చేపల పెంపకం పట్ల ప్రభుత్వం దృష్టి సారించింది. గొర్రెల పెంపకాన్ని అభివృద్ధి చేసి, గొల్లకురుమల  ఆదాయాన్ని సమ కూర్చే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. వచ్చే రెండేండ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నాలుగు లక్షల యాదవ కుటుంబాలకు 84 లక్షల గొర్రెలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గొర్రెల అభివృద్ధి సహకార సంఘంలో నమోదు చేసుకున్న ప్రతి అర్హత గల కుటుంబానికి 20 గొర్రెలు, ఒక  పొట్టేలును 75 శాతం సబ్సిడీతో సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ ల నుంచి గొర్రెలను కొనుగోలు చేస్తాం. ఈ పథకం నాలుగు లక్షల యాదవ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని  మెరుగుపరుస్తుంది. ప్రతి యాదవ కుటుంబానికి కొద్దో గొప్పో భూమి ఉంటుంది, కాబట్టి మేత సమస్య తలెత్తదు. గొర్రె మాంసానికి రాష్ట్రంలో, దేశంలో, విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. ఈ పథకం అమలు పూర్తయిన తరువాత రాష్ట్రం మాంసం ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించడమే

కాకుండా ఎగుమతి చేసే దశకు తీసుకుపోతాం. అటవి భూముల్లో స్టైలో గ్రాస్ పెంచి గొర్రెల మేతకు వీలు కల్పిస్తాం. వెటర్నరీ వైద్యం, మందులు, మంద దగ్గరికి వచ్చే విధానాన్ని రూపొందిస్తున్నాం. ఈ పథకం యాదవుల పనికి గౌరవాన్ని, రాష్ట్రానికి ఆర్థిక సంపదను చేకూరుస్తుంది.

**చేపల పెంపకం:**

29. గంగపుత్ర, ముదిరాజ్ కులాలవారితో పాటు బోయ కులస్తులు చేపలు పట్టడంపై ఆధారపడి జీవిస్తున్నారు. నీటి ప్రాజెక్టులు పూర్తి చేయడం, చెరువులను పునరుద్ధరించడం వల్ల చేపల పెంపకానికి అవకాశాలు మెండుగా ఏర్పడుతున్నాయి. ఉమ్మడి ప్రాజెక్టులైన నాగార్జునసాగర్, శ్రీశైలం, పులిచింతల, జూరాల ప్రాజెక్టుల్లో మనకు వాటా ఉంది. ఇంకా గోదావరి, కృష్ణా నదులను అనుసరించుకుని అనేక ప్రాజెక్టులున్నాయి. మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువులు బాగు చేసుకున్నాం. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులతో పాటు ఇతర చిన్న మధ్య తరహా ప్రాజెక్టులు కడుతున్నాం. వీటన్నంటి ద్వారా జలావరణ విస్తీర్ణం (వాటర్ స్ప్రెడ్ ఏరియా) పెరిగి చేపల పెంపకం పెద్ద ఎత్తున సాగించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ జలాశయాల్లో మత్స్యకారుల ద్వారా చేపల పెంపకానికి చర్యలు తీసుకుంటాం. చేపల విత్తనాన్ని ప్రభుత్వమే సరఫరా చేస్తుంది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాలను అభివృద్ధి చేస్తాం. చేపల పెంపకంతో పాటు ఇతర నిర్వహణ వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. మార్కెటింగ్ సౌకర్యాలను పెద్ద ఎత్తున కల్పిస్తుంది. చేపల అమ్మకానికి పెద్ద ఎత్తున రిటేల్ మార్కెట్లను నిర్మిస్తున్నాం. ఈ చర్యల వల్ల చేపల పెంపకం పరిశ్రమ స్థాయికి ఎదిగి, చేపల పెంపకం పై ఆధార పడిన లక్షలాది మత్స్యకారుల బతుకులు మారిపోయి, ఆర్థికంగా బలపడతారు.

30. తమ వృత్తి ద్వారా ప్రజలకు విశేష సేవచేస్తూ జీవిస్తున్న నాయీ బ్రాహ్మణులకు, రజకులకు ప్రత్యేక సహకారాన్ని అందిస్తామని తెలియచేసేందుకు సంతోషిస్తున్నాను. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, ఆధునికమైన

నవీన క్షౌరశాలలు ఏర్పాటు చేసుకోవడం కోసం నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం పెట్టుబడిని సమకూరుస్తుంది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో వీరి ద్వారా ఆరోగ్యకరమైన సేవలు అందుతాయి. రజకులకు అవసరమైన వసతుల కల్పనకు ప్రభుత్వం పూనుకున్నది. వారు తమ వృత్తిని ఆధునీకరించుకునేందుకు వీలుగా వాషింగ్ మిషన్లను, డ్రయర్లను, ఐరన్ బాక్సులను పంపిణీ చేయాలని నిర్ణయించింది. అదే విధంగా బట్టలుతికే చెరువుల వద్ద వీరికోసం దోబీఘాట్లను నిర్మించి ఇస్తుంది. రజక మరియు నాయిబ్రాహ్మణుల పథకాలకు బడ్జెట్ రూ.500 కోట్లు ప్రతిపాదించడమైనది.

31. విశ్వకర్మలుగా పిలవబడే ఔసల, కమ్మరి, కంచరి, వడ్రంగి, శిల్పకారులకు, బట్టలు కుట్టి జీవించే మేర కులస్తులకు, కల్లుగీత ఆధారంగా జీవిస్తున్న గౌడులకు, కుమ్మరి పనివారికి, తదితర కులవృత్తుల వారందరికీ అవసరమైన ఆర్థిక సహకారం, పరికరాల పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది, దీనికోసం నిర్దిష్ట పథకాలను రూపొందిస్తున్నది.

**చేనేత కార్మికుల సంక్షేమం:**

32. చేనేత కార్మికులు దయనీయ స్థితిలో జీవిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎంత మొత్తుకున్నా అప్పటి ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి. ఈ నిర్లక్ష్యం కారణంగా చేనేత కార్మికులు ఆత్మ విశ్వాసం కోల్పోయి ఆత్మహత్యల పాలయ్యారు.

33. నేతన్నల దయనీయ స్థితికి చలించిన గౌరవ ముఖ్యమంత్రి కే.సి.ఆర్ గారు వీరిని కష్టాల నుంచి శాశ్వతంగా గట్టెక్కించడానికి త్రిముఖ వ్యూహం రూపొందించారు. చేనేత వస్త్రాలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది. నూలు, రసాయనాలను సబ్సిడీపై అందిస్తుంది. మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుంది.

34. పెద్ద సంఖ్యలో ఉన్న పవర్ లూమ్‌లను ఆధునీకరించి ఉత్పత్తి పెంచేందుకు చర్యలు తీసుకుంటాం. కార్మికులకు ప్రతీ నెలా 15 వేలకు తగ్గకుండా వేతనం ఇచ్చే

విధంగా పవర్ లూమ్ యాజమాన్యాలను ప్రభుత్వం ఒప్పించింది. ప్రభుత్వం తరుపున జరిపే వస్త్రాల కొనుగోళ్ల ఆర్డర్లను చేనేత, మరమగ్గాల సొసైటీలకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూసుకోవాలనుకునే నేతపనివారికి తగిన ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించింది.

35. వరంగల్‌లో టెక్స్‌టైల్స్ పార్క్, సిరిసిల్లలో అపరెల్ పార్క్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ బడ్జెట్‌లో నేత కార్మికుల కోసం రూ.1200 కోట్లు కేటాయిస్తున్నాం. గత కేటాయింపులతో పోలిస్తే ఇది భారీ పెంపుదల.

36. ఒక పక్క భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల పునరుద్ధరణ ద్వారా వ్యవసాయాన్ని అభివృద్ధి పరచడం, చేనుల పంటతో పాటు చేపల పంటనూ సాధించి మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడం, పచ్చిక బయళ్లలో గొర్రెల మందలతో యాదవుల జీవితాలు కళకళలాడే విధంగా చేయడం, వివిధ కులవృత్తుల వారు కడుపు నిండా తిని కంటినిండా నిద్రపోయే పరిస్థితిని సృష్టించడం, అంతిమంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టపరిచి తెలంగాణ సమాజాన్ని సుసంపన్నం చేయడానికి ప్రభుత్వం సమగ్ర దృక్పథంతో ముందడుగు వేస్తున్నది.

37. సమాజానికి మూలాధారాలుగా నిలిచిన మరెన్నో కులాలు నేడు అత్యంత వెనుకబాటుతనాన్ని అనుభవిస్తున్నాయి. ఎం.బి.సి.లుగా భావిస్తున్న ఈ కులాల వారికి చేద్దామంటే పనిలేదు. దున్నుదామంటే మడిలేదు. సామాజిక భద్రత లేదు. అధికారంలో స్థానం లేదు. వీరి పట్ల ఇంత వరకు ప్రభుత్వాలకు పట్టింపులేదు. బతుక్కి భరోసా అటుంచి అసలు మనుషులుగానే గుర్తింపు లేదు. తమ బాధలు తీర్చమని ఏండ్ల తరబడి ఎన్నో ప్రభుత్వాలను ఎంత వేడుకున్నా అరిచి అంగలార్చినా వారి వేదన అరణ్యరోదనగానే మిగిలిపోయింది. తమ బతుకులు ఏనాటికైనా మారకపోతాయా అని ఎం.బి.సి. కులాల బిడ్డలు ఎక్కని కొండ లేదు, మొక్కని బండ లేదు. దిక్కూ దివాణం లేక చెట్టుకొకళ్ళు పుట్టకొకళ్ళయి బతుకుతున్న ఎం.బి.సి.లకు ఇన్నాళ్లకు కే.సి.ఆర్ రూపంలో అసలైన అండ దొరికింది. ఎన్నాళ్లుగానో చీకటిలో మగ్గుతున్న వీళ్ల జీవితాల మీద తొలి

వెలుగు ప్రసరిస్తున్నది. ఎం.బి.సి.ల స్థితిగతులను అర్థం చేసుకుని వారి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. ఎం.బి.సి.ల అభివృద్ధి, సంక్షేమం కోసం ఈ బడ్జెట్లో వెయ్యి కోట్ల రూపాయలు కేటాయిస్తున్నామని చెప్పడానికి సంతోషిస్తున్నాము. ఈ ప్రయత్నం అణగారిన వర్గాల అభ్యున్నతి సాధించే దిశలో గొప్ప మైలురాయిగా నిలిచిపోతుంది.

38. ఈ బడ్జెట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమానికి రూ.5,070.36 కోట్లు ప్రతిపాదించాం. దీనికి తోడు బియ్యం సబ్సిడి, విద్యుత్ సబ్సిడి, ఋణ మాఫీ, విద్యా, వైద్య సదుపాయాలు తదితర అంశాలలో బి.సి.లబ్దిదారుల వ్యయాన్ని జోడించినప్పుడు బి.సి. సంక్షేమానికి భారీ నిధులు ఖర్చు అవుతాయి.

**కళ్యాణ లక్ష్మి:**

39. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి మానసపుత్రిక అయిన కళ్యాణలక్ష్మి పథకం మాకూ ప్రజలకూ ఎంతో సంతోషాన్ని, సంతృప్తినీ కలిగిస్తున్న పథకం. గౌరవ శాసనసభ్యులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణలో పారదర్శకంగా అమలవుతున్న ఈ పథకాన్ని తెలంగాణ ప్రజానీకం వేనోళ్ల కొనియాడుతున్నారు. నిండు హృదయంతో ప్రభుత్వానికి దీవెనార్తులు పెడుతున్నారు. పేద ప్రజల కుటుంబాల్లో ఎనలేని ఆనందం పంచుతున్న ఈ పథకంలో భాగంగా పేదింటి ఆడపిల్లల పెండ్లికి 51 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని పెండ్లి కానుకగా ప్రభుత్వం అందిస్తున్నది. మన ముఖ్యమంత్రి గారు ప్రజలతో సంభాషిస్తున్న నేపథ్యంలో కళ్యాణలక్ష్మి పథకంతో కలిగిన తమ సంబురాన్ని పంచుకోవడంతో పాటు, పెండ్లి ఖర్చులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ పథకం క్రింద ఇస్తున్న మొత్తాన్ని ఇంకొంత పెంచితే బాగుంటుందని విన్నవించుకుంటున్నారు. ఆడపిల్లల పట్ల అమితమైన అనురాగం, గౌరవం కలిగుండడం తెలంగాణ సంస్కృతి. ఆ సంస్కృతికి ప్రతిరూపమయిన మన ముఖ్యమంత్రి గారు వారి విన్నపాన్ని నెరవేరుస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి శుభప్రదమైన కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్ పథకాల ద్వారా పేదింటి ఆడపిల్లల పెండ్లి కోసం వారి కుటుంబాలకు అందించే మొత్తాన్ని రూ.51,000

నుంచి రూ.75,116 రూపాయలకు పెంచుతున్నామని మహదానందంగా ప్రకటిస్తు న్నాము.

**మహిళా శిశు సంక్షేమం:**

40. మాతృమూర్తులైన మహిళల సంక్షేమం కోసం మా ప్రభుత్వం ఎన్నో మానవీయ నిర్ణయాలు తీసుకున్నది. గర్భిణులు, బాలింతలకు, శిశువులకు సరిపడేంత పోషకాహారం లభించాలనే ఉదాత్త భావనతో అంగన్ వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి కార్యక్రమం ద్వారా ప్రతీ రోజు గుడ్లు, పాలు, పోషకాహారం అందిస్తున్నాం. గర్భిణులు, బాలింతలు, శిశువులకు తేలికగా జీర్ణం కావాలంటే నాణ్యమైన సన్నబియ్యం అన్నం కావాలి. ఈ అవసరాన్ని గుర్తించిన మా ప్రభుత్వం ఇప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం సరఫరా చేయాలని నిర్ణయించింది.

41. బిడ్డకు జన్మనివ్వబోయే దశలో గర్భిణీ స్త్రీలకు పూర్తి విశ్రాంతినిచ్చి వారి ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్త వహించాలి. కానీ నిరుపేద మహిళలెందరో ఏడెనిమిది నెలలు నిండిన తర్వాత కూడా ఇల్లు గడవడం కోసం కూలీ పనులకు పోవాల్సి రావడం అత్యంత దయనీయం. సభ్య సమాజానికి అవమానం. ఈ దుస్థితి తల్లికే కాకుండా గర్భస్థ శిశువుకు కూడా ఎంతో ప్రమాదకరం. మానవత్వానికి మారుపేరుగా నిలిచే మా ముఖ్యమంత్రి గారు గర్భిణీ స్త్రీలు ఎదుర్కొంటున్న ఈ సమస్యను ఎంతో గంభీరతతో అర్థం చేసుకున్నారు. గర్భిణీ దశలో ఉపాధి కోల్పోయే స్త్రీలకు అవసరమయ్యే మొత్తాన్ని ప్రభుత్వమే అందించాలని ఆర్ద్ర హృదయంతో నిర్ణయం తీసుకున్నారు. మా ప్రభుత్వం స్త్రీల సమస్యల పట్ల ఎంత సున్నితంగా ఆలోచిస్తుందో చెప్పడానికి ఇది నిదర్శనం. గర్భిణీ అయిన స్త్రీ ప్రసవం కోసం ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన వెంటనే వారి జీవన అవసరాల కోసం మొదటి విడతగా 4 వేల మొత్తాన్ని ప్రభుత్వం అందిస్తుంది. ప్రసూతి తర్వాత డిశ్చార్జి అయ్యే సమయంలో మరో 4 వేలు, పుట్టిన బిడ్డకు పోలియో టీకా వేయించుకోవడానికి వచ్చినప్పుడు మరో 4 వేలు అందిస్తుంది. మూడు విడతల్లో మొత్తం 12 వేల రూపాయ

లను అందిస్తుంది. ఆడపిల్లను ప్రసవించిన మహిళకు ప్రత్యేకంగా మరో వెయ్యి రూపా యలు ప్రోత్సాహకంగా అందిస్తుంది.

42. పిండ దశలో చోటు చేసుకునే జన్యు లోపాలు బిడ్డల్ని జీవితాంతం వేధిస్తాయి. కనుక ప్రసవం ఆసుపత్రిలోనే జరగాలనే శాస్త్రీయ అవగాహనను పెంచే దిశలో, తద్వారా శిశు మరణాల రేటును తగ్గించే దిశలో ఈ పథకం సత్ఫలితా లనిస్తుందని ఆశిస్తున్నాం. పుట్టిన బిడ్డ సంరక్షణ కోసం అవసరమయ్యే 16 వస్తువులను కే.సి.ఆర్ కిట్ పేరుతో అందివ్వాలని మరో మంచి నిర్ణయం తీసుకున్నాం. ఈ కిట్ నవ జాత శిశువుకు మూడు నెలలు వచ్చే వరకు ఉపయోగపడుతుంది. ఈ కిట్ లో తల్లికి, బిడ్డకు ఉపయోగపడే సబ్బులు, బేబి అయిల్, చిన్న పిల్లల పరుపు, దోమతెర, డ్రెస్సులు, చీరలు, హ్యాండ్ బ్యాగు, టవళ్లు, నాప్కిన్స్, పౌడర్, డైపర్లు, షాంపు, పిల్లల ఆట వస్తువు లుంటాయి. ఈ పథకానికి రూ.605 కోట్లు కేటాయిస్తున్నాము.

43. అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్లు బడుగు ఉద్యోగినులుగా తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారు. వీరు క్షేత్రస్థాయిలో అట్టడుగు వర్గాల్లోని మహిళలకు వివిధ సేవలు అందించే కీలక కర్తవ్యాన్ని నెరవేరుస్తున్నారు. అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్లకు మంచి జీతాలు అందిస్తే, వారు పేదమహిళలకు మంచి జీవితాలు అందించే సేవలు మెరుగ్గా చేస్తారు. అంగన్ వాడి కార్యకర్తల జీతాన్ని ఏడు వేల నుంచి పదిన్నర వేలకు పెంచటం జరిగింది. అంగన్‌వాడీల కార్యకర్తల జీతాలు పెంచడం ఇది రెండవ సారి. వారి విధి నిర్వహణకు మరింత గౌరవం తేవడం కోసం వారి ఉద్యోగాన్ని అంగన్‌వాడి టీచర్లుగా ఉన్నతీకరిస్తున్నాం. మినీ అంగన్‌వాడి కార్యకర్తలు, హెల్పర్ల జీతాలను కూడా నాలుగు న్నర వేల నుంచి ఆరు వేలకు పెంచాం. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి వీరికి కూడా జీతాలు పెంచడం ఇది రెండవ సారి. జీతాలు పెంచడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 35 వేల అంగన్‌వాడి కేంద్రాలలో ఉన్న 67,411 మంది సిబ్బంది లబ్ధి పొందుతారు. మహిళా శిశు సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో మొత్తం రూ.1731.50 కోట్లు ప్రతిపాదించాం.

**షెడ్యూల్డ్ కులాల సంక్షేమం:**

44. బడ్జెట్ స్వరూపం మారిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి నిధుల కేటాయింపునకు మరింత పటిష్టమైన చట్టబద్ధతను కల్పిస్తున్నది. ఎస్సీల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తున్నది. అవి మూడెకరాల సాగు భూమి, యువతకు నైపుణ్యాభివృద్ధి, కళ్యాణ లక్ష్మి, విదేశాలలో విద్యాభ్యాసానికి తోడ్పాటు, ఇంటికి యాభై యూనిట్ల ఉచిత కరెంటు మొదలైనవి అమలు పరుస్తు న్నది. రాష్ట్రావతరణకు ముందు 1972 నుంచి 2014 దాకా, ప్రభుత్వాలు 73.66 కోట్లు ఖర్చుచేసి 1,242 ఎకరాల భూమిని కొనుగోలు చేసి కేటాయించారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 406 కోట్లతో 3,671 దళిత కుటుంబాలకు 9,664 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం మొదటిసారిగా ఎస్సీ, ఎస్టీలకు వ్యవసాయ మార్కెట్ కమిటీలలో రిజర్వేషన్ ను అమలు చేసింది.

45. ఎస్సీల అభ్యున్నతికి విద్యా అవకాశాలు పెంచడం కీలకం. డాక్టర్ అంబేద్కర్ 125 వ జయంతి సందర్భంగా ప్రభుత్వం ఎస్సీల కోసం 130 గురుకుల విద్యాలయాలను మంజూరు చేసింది. ఇప్పటి వరకు 103 గురుకులాలను ప్రారంభించింది. ఎస్సీ విద్యార్థినుల సమస్యలు తీర్చడానికి 2016-17 లో 23 గురు కుల కళాశాలలను ప్రారంభించింది. వచ్చే ఏడాది మరో ఏడు ఇటువంటి కళాశాలలను ప్రారంభిస్తున్నాం. విదేశీ విద్య కోసం స్కాలర్‌షిప్‌ను మా ప్రభుత్వం పది లక్షల నుంచి ఇరవై లక్షలకు పెంచింది. రాష్ట్రావతరణ కు ముందు ఒకే ఎస్సీ స్టడీ సర్కిల్ ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం తొమ్మిది స్టడీ సర్కిల్స్ ను మంజూరు చేసింది. హైదరాబాద్ మినహా తొమ్మిది పాత జిల్లాలలో ఒక్కొక్కటి మంజూరు చేసింది. కొత్త విద్యా సంవత్సరం నుంచి కొత్త స్టడీ సర్కిల్స్ ఏర్పాటు జరుగుతుంది. సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ళలో సన్న బియ్యం సరఫరా చేస్తున్నాం.

46. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సిన అనివార్యత దృష్ట్యా రాష్ట్ర బడ్జెట్ స్వరూపంలో మార్పులు చేస్తున్న విషయం ఇంతకు ముందే ప్రస్తావించాను. దీనివల్ల ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ విషయంలో కూడా మార్పులు చేపట్ట వలసిన అవసరం ఏర్ప డింది. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు బదులుగా ఆయా వర్గాలకు జనాభా నిష్పత్తి ప్రకారం

నిధులు కేటాయించాలనే లక్ష్యంతో ఎస్సీ, ఎస్టీ ల ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించాలని నిర్ణయించాం. ఎస్సీల సంక్షేమం కోసం చేపట్టిన మొత్తం పథకాలకు రూ.14,375.12 కోట్లు కేటాయించాం.

**షెడ్యూల్డు తెగల సంక్షేమం:**

47. షెడ్యూల్డు తెగల సంక్షేమం ప్రభుత్వ ప్రాధాన్యాలలో ఒకటి. రాష్ట్రావతరణ తరువాత ఎస్టీ విద్యార్థులు కోసం ప్రభుత్వం 51 గురుకుల పాఠశాలలను ప్రారంభించింది. ప్రస్తుతం రాష్ట్రంలో నాలుగు ఎస్టీ స్టడీ సర్కిల్స్ ఉన్నాయి. ఎస్టీ జనాభాకు అనుగుణంగా జిల్లాలలో కొత్త స్టడీ సర్కిల్స్ ను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే పంచాయితి ఎన్నికల నాటికి గిరిజన తండాలను, గూడాలను గ్రామ పంచాయితీలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. చెల్లప్ప కమీషన్ నివేదిక వచ్చిన తరువాత వాల్మీకి బోయ, ఖైతి లంబాడ కులాలను ఎస్టీ కేటగిరిలో చేర్చే విషయం పరిశీలిస్తాం. ఎస్టీ సంక్షేమానికి మొత్తం కేటాయింపు రూ.8165.88 కోట్లు.

**బీసీల సంక్షేమం:**

48. రాష్ట్ర జనాభాలో వెనుకబడిన తరగతుల జనాభానే అధికం. ఈ వర్గాల సంక్షేమం కోసం పాటుపడకపోతే అభివృద్ధికి అర్థం ఉండదు. విదేశాలలో చదువుకునే బీసీ విద్యార్థులకు తోడ్పాటు అందించడానికి మహాత్మా జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యా నిధి పేర ప్రత్యేక ఆర్థిక తోడ్పాటు పథకాన్ని ప్రారంభించాం. బీసీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ అందిస్తున్నాం. ప్రతి నియోజకవర్గానికి ఒక గురుకుల పాఠశాల చొప్పున 119 బి.సి గురుకుల పాఠశాలలను వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రారంభిస్తున్నాము. ఈ పాఠశాలల్లో ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు 76,160 మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలు గల విద్య అందుతుందని అశిస్తున్నాం. మౌళిక వసతులు, పోషకాహారం, పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ తదితర వసతులకు మొత్తం ఒక్కో విద్యార్థికి 1.05 నుంచి 1.25 లక్షల వరకు వ్యయం అవుతుందని అంచనా. బీసీ విద్యార్థుల కోసం ఇంత పెద్ద

ఎత్తున గురుకుల విద్యాలయాలను మరే రాష్ట్రం స్థాపించలేదు. గొర్రెల, చేపల పెంపకం, ఎం.బీ.సీలకు ప్రత్యేక పథకాలు, రజక, నాయిబ్రాహ్మణలకు పథకాలు, చేనేత కార్మికులకు, పవర్‌లూమ్ వారికి పథకాలు అన్నీ కూడా బీ.సీ సంక్షేమానికి సంబంధించినవే. వీటిలో కొన్ని పథకాలు పశుసంవర్ధక శాఖ, పరిశ్రమల శాఖ ద్వారా అమలు చేయబడినా, నిధులు బీ.సీ సంక్షేమ శాఖ ద్వారా మంజూరు చేయబడుతాయి. బీ.సీల సంక్షేమానికి మొత్తం బడ్జెట్ కేటాయింపు రూ.5070.36 కోట్లు.

## మైనారిటీ సంక్షేమం:

49. తెలంగాణ మత సామరస్యానికి, సమరస భావనకు పేరు గాంచింది. తెలంగాణ జీవనరీతిని మహాత్మా గాంధీ గంగా జమున తహజీబ్ గా అభివర్ణించారు. రాష్ట్ర జనాభాలో మైనారిటీలు 14.2 శాతం ఉంటారు. రాష్ట్రావతరణ నాటి నుంచి ప్రభుత్వం మైనారిటీల ఆర్థికాభివృద్ధికి అనేక చర్యలు చేపట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులతో సమానంగా మైనారిటీ వర్గానికి చెందిన విద్యార్థులకు 1.08 లక్షల మందికి పోస్ట్‌మెట్రిక్ స్కాలర్ షిప్పులు ఇస్తున్నది. మైనారిటీల కోసం 201 రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసింది. ఇందులో 71 ఇప్పటికే ప్రారంభించబడ్డాయి. మిగతా వాటిని వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభిస్తాం. మైనారిటీ వ్యాపారస్తులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం టిఎస్–ప్రైమ్ పథకాన్ని ప్రారంభిస్తున్నది. మొదటి సారిగా ప్రభుత్వం ఇమామ్స్‌కు, మౌజామ్స్‌కు నెలకు వేయి రూపాయల గౌరవ వేతనం ప్రవేశ పెట్టింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ గౌరవ వేతనాన్ని పదిహేను వందలకు పెంచుతున్నది. దీని ద్వారా 10,000 మంది లబ్ధి పొందుతారు. రాష్ట్ర ప్రభుత్వం, రంజాన్, క్రిస్మస్‌లను రాష్ట్ర పండుగలుగా గుర్తించి పేదలకు విందులు ఏర్పాటు చేయడంతో పాటు దుస్తులు పంపిణి చేస్తున్నది. మైనారిటీ సంక్షేమం కోసం రూ.1249.66 కోట్ల బడ్జెట్ ను కేటాయిస్తున్నాం.

**రెండు పడక గదుల ఇండ్లు:**

50. పేదలకు గౌరవ ప్రదమైన నివాసాన్ని కల్పించాలనే గొప్ప ఉద్దేశ్యంతో మా ప్రభుత్వం 2.60 లక్షల రెండు పడక గదుల ఇండ్లను మంజూరు చేసింది. ఇందులో 28, ఫిబ్రవరి 2017, నాటికి 1,426 గృహాలు పూర్తయ్యాయి, 16,068 ఇండ్లు వివిధ దశ లలో ఉన్నాయి. టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నది. అసెంబ్లీ గత సెషన్లలో గౌరవ ముఖ్యమంత్రి గారు చెప్పినట్టు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ఇతర సాగునీటి ప్రాజె క్టులు ముమ్మరంగా జరుగుతున్న మూలంగా కాంట్రాక్టర్లు ఈ రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణం పట్ల అంత ఆసక్తి చూపడం లేదు. రెండు పడక గదుల ఇండ్ల నిర్మాణాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తున్నది. బహిరంగ మార్కె ట్‌లో సిమెంట్ బ్యాగ్ ధర రూ.320/- ఉండగా, 230 రూపాయలకు సిమెంటు బ్యాగ్ సరఫరా చేసే విధంగా ప్రభుత్వం 31 కంపెనీలతో ఎం.ఓ.యు కుదుర్చుకున్నది. జిల్లా కలెక్టర్లు వీటి నిర్మాణానికి తగిన స్థలాలను గుర్తించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వీటి నిర్మాణం పుంజుకుంటుంది. బడ్జెటేతర వనరుల నుంచి వీటి నిర్మాణ వ్యయానికి నిధుల సమీకరణ జరుగుతుంది.

**ఆసరా ఫించన్లు:**

51. వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు ఆసరా ఫించన్లు గౌరవాన్ని తెచ్చిపెట్టాయి. 2017 ఎప్రిల్ నుంచి ఆసరా ఫించన్‌ను ఒంటరి మహిళలకు వర్తింపచే యాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని వల్ల ఒంటరి మహిళలకు అవమానాల నుంచి నిస్సహాయత నుంచి గట్టెక్కించినట్టవుతుంది. ఆసరా ఫించన్లకు మొత్తం కేటాయింపు రూ.5,330.59 కోట్లు.

**బ్రాహ్మణుల సంక్షేమం:**

52. బ్రాహ్మణులు ఉన్నత సామాజిక వర్గానికి చెందిన వారైనప్పటికీ వీరిలో ఎక్కువ మంది తక్కువ ఆదాయం గలవారు. హైదరాబాద్‌లో బ్రాహ్మణ సదనం నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే భూమి, వంద కోట్ల రూపాయలు కేటాయించింది. ఈ సామాజిక వర్గంలోని పేదల ఇక్కట్లు తీర్చే విధంగా వివిధ పథకాలు అమలు చేయటానికి ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఈ బడ్జెట్‌లో రూ.100 కోట్లు కేటాయిస్తున్నాం.

**ఫీ–రియెంబర్స్‌మెంట్ :**

53. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న ఫీజు రీయెంబర్స్‌మెంట్ బకాయిలు 1880.97 కోట్ల రూపాయలు. ఈ బకాయి భారం ప్రతీ ఏడాది ఫీజు రీయెంబర్స్‌మెంట్ చెల్లింపులు సందర్భంగా సమస్యగానే వెంటాడుతోంది. అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటి దాకా రూ.5,662.07 కోట్ల ఫీజు రీయెంబర్స్‌మెంటు కోసం చెల్లించాం. ఈ ఏడాది బడ్జెట్లో రూ.1,939.93 ను ఇందుకోసం కేటాయించాం.

**ఉద్యోగుల సంక్షేమం :**

54. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉద్యోగులు ఆశించిన విధంగానే వారి ప్రయోజనాలు ఒక్కొక్కటిగా నెరవేరుతున్నాయి. రాష్ట్రం ఏర్పడ్డ తొలి నాళ్లలోనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు గతంలో ఎన్నడూ లేని విధంగా 43 శాతం ఫిట్‌మెంట్ ప్రభుత్వం ఇచ్చింది. రాష్ట్రం ఏర్పడ్డ సంతోషానికి సంకేతంగా ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంటు మంజూరు చేసింది. ఆరోగ్య భద్రత కోసం కుటుంబ సభ్యులందరికీ వర్తించే విధంగా హెల్త్ కార్డులను అందించింది. తక్కువ వేతనాలతో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాలను భారీగా పెంచింది. కనీస వేతన చట్టం పేర్కొన్న దానికన్నా రాష్ట్రంలో ఎక్కువగా జీతాలు పెంచింది.

రూ.6700 జీతం పొందుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాన్ని రూ.12 వేలకు పెంచింది. రూ.8,400 వస్తున్న వారికి రూ.15,000 కు పెంచింది. రూ.10,900 జీతం పొందుతున్న వారికి రూ.17 వేలకు వేతనాలను ప్రభుత్వం పెంచింది. రాష్ట్రంలోని రెసి డెన్షియల్ స్కూళ్లలో పని చేస్తున్న కాంట్రాక్టు టీచర్ల వేతనాలను ప్రభుత్వం పెంచింది. ఎస్జిటీలకు 10,900 రూపాయలు, స్కూల్ అసిస్టెంట్లకు రూ.14,800 చెల్లిస్తున్నది. వారసత్వంగా వి.ఆర్.ఎ.లుగా పనిచేస్తున్న వారి వేతనాలను 64.61 శాతం పెంచి, ప్రభుత్వం బడుగు ఉద్యోగుల పట్ల తనకున్న మానవత్వాన్ని చాటుకున్నది. వి.ఆర్.ఎల జీతం రూ.6500 నుంచి రూ.10,500కు పెంచింది. దీంతో పాటు వీరికి 200 రూపా యల తెలంగాణ సాధన ఇంక్రిమెంటు కూడా అందించనుంది. రూ.500 నుంచి రూ.1500 వరకు మాత్రమే వేతనం పొందుతున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు రూ.5 వేల జీతం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అంగన్‌వాడీ టీచర్ల, హెల్పర్ల జీతాలను పెంచింది. ఇటీవల మరోసారి వారి జీతాలు పెంచింది. తెలంగాణ వచ్చే నాటికి రూ.4200 ఉన్న అంగన్‌వాడీ టీచర్ల జీతం నేడు రూ.10,500 అయింది. హెల్పర్ల జీతం రూ.2,200 నుంచి రూ.6 వేలయింది. ఐకెపి ఉద్యోగులు, సిబ్బందికి కూడా ప్రభుత్వం వేతనాలు పెంచింది. సెర్ప్‌తో పాటు జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి కూడా వేతనాలు పెంచింది. సెర్ప్‌లో క్లస్టర్ కోఆర్డినేటర్లకు రూ.6,150 నుంచి జీతాన్ని రెట్టింపు చేసి 12 వేల రూపాయలు అందిస్తున్నది. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనం రూ.6290 నుంచి రూ.10 వేలకు పెంచింది. తెలంగాణ వచ్చే నాటికి హోంగా ర్డులు తీసుకుంటున్న జీతం కేవలం ఆరు వేలు. మా ప్రభుత్వం వారి జీతాన్ని రెండు విడ తలుగా పెంచి 12 వేలు చేసింది. జిహెచ్ఎంసి పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని రూ.8500 నుంచి 12,500 రూపాయలకు పెంచింది. డ్రైవర్ల వేతనాన్ని రూ.10,200 నుంచి రూ.15,000కు పెంచింది.

**జర్నలిస్టుల సంక్షేమం :**

55. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నది. జర్నలిస్టుల కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు హెల్త్ కార్డులు అందించి, వారికి ప్రభుత్వ ఖర్చులతో మంచి వైద్యం అందిస్తున్నాం. మరణించిన జర్నలిస్టుల కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించడంతో పాటు ప్రతీ నెల మూడు వేల రూపాయల పెన్షన్ కూడా అందిస్తున్నాం. పదవ తరగతి లోపు విద్యార్థులున్న కుటుంబాలకు ఒక్కో విద్యార్థికి వెయ్యి రూపాయల చొప్పున అదనంగా సహాయం అందిస్తున్నాం. ఈ విధంగా మరణించిన జర్నలిస్టుల కుటుంబాల కోసం ఓ పథకాన్ని పెట్టిన రాష్ట్రం తెలంగాణ తప్ప దేశంలో మరొకటి లేదు. ఈ ఏడాది బడ్జెట్లో జర్నలిస్టుల సంక్షేమానికి రూ.30 కోట్లు కేటాయిస్తున్నాం.

**సైనిక సంక్షేమం:**

56. సైనికులు, మాజీ సైనికుల సంక్షేమానికి, మరణించిన సైనికుల కుటుంబాల సంక్షేమానికి దేశంలో మరే రాష్ట్రంలో లేని పథకాలను తెలంగాణ రాష్ట్రం చేపట్టింది. రిటైరైన తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలో మరో ఉద్యోగం చేసిన వారికి డబుల్ పెన్షన్ అందించే విధానాన్ని మన రాష్ట్రంలో అమలు చేస్తున్నాం. అమర జవాన్లకు అందించే గ్యాలంటరీ అవార్డుల ద్వారా అందించే నగదును దేశంలో అన్ని రాష్ట్రాలకంటే తెలంగాణ రాష్ట్రమే ఎక్కువగా ప్రకటించింది. సైనికుల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు తీసుకోవడానికి వీలుగా రాష్ట్రంలో సైనిక సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తున్నాం.

**ఆరోగ్యం:**

57. రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణ వ్యవస్థను చక్కదిద్దేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపడుతున్నది. ప్రజారోగ్య వ్యవస్థను విస్తృత పరచడానికి, సౌకర్యాలను మెరుగుపరచడానికి సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రభుత్వ వైద్య వ్యవస్థను గతంలో

తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రభుత్వ వైద్యశాలల మీద ప్రజలు విశ్వాసం కోల్పోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ వైద్యం మీద మళ్లీ ప్రజలకు నమ్మకం పెరిగే విధంగా రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ దవాఖానాలను మెరుగుపర్చడానికి ప్రభుత్వం పూనుకున్నది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి మొదలుకుని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వరకు అన్ని ప్రభుత్వ హాస్పిటళ్లకు నేరుగా నిధులు అందిస్తున్నది. హాస్పిటళ్లలో బెడ్ ల సంఖ్యను బట్టి నిధులను కేటాయించి, వాటిని నేరుగా ఆసుపత్రులకే విడుదల చేస్తున్నది. హాస్పిటళ్లలో మందుల కొనుగోలుకు నిధులను రెట్టింపు చేసింది. అన్ని హాస్పిటళ్లలో పాడుపడిన బెడ్లు, బెడ్ షీట్లు, సెలైన్ స్టాండ్లు ఇతర పరికరాలను కొత్తవి అందిస్తున్నాం. హైదరాబాద్‌లో కొత్తగా మరో 3 మల్టిసూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లను నిర్మిస్తున్నాం. ఒక మల్టిసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను కరీంనగర్‌లో నిర్మించే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా 108 సేవలను విస్తరించేందుకు కొత్తగా 145 వాహనాలను కొనుగోలు చేశాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మరణించిన వారి మృతదేహాలను ఇండ్లకు తరలించడానికి పేదలు పడే ఇబ్బందులను ఈ ప్రభుత్వం మానవత్వంతో అర్థం చేసుకున్నది. మృతదేహాలను తరలించడానికి గత ఏడాది 50 వాహనాలను సమకూర్చాం. ఈ ఏడాది మరో 50 వాహనాలను కొనుగోలు చేస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో, ఆదివాసీ గూడేలలో వైద్యసేవలను విస్తరించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే 39 వాహనాలు కొనుగోలు చేసి ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో పేదలను ఆసుపత్రులకు తరలిస్తున్నాం. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు చేసిన ప్రయత్నాల వల్ల, ఒకటికి నాలుగు సార్లు కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం వల్ల, మన ఎం.పిలు పార్లమెంటులో ఒత్తిడి చేయడంవల్ల కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి ఎయిమ్స్ మంజూరు చేయడానికి చర్యలు తీసుకుంటున్నది. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజారోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నది. ఇందుకోసం ఈ బడ్జెట్లో ఆరోగ్య శాఖకు రూ.5976.17 కోట్లు కేటాయిస్తున్నాం.

**విద్య:**

58. విద్య మనిషికి మూడో కన్ను. సమాజం సాధించిన నాగరికత విలువలు, విజ్ఞానం కొత్త తరానికి అందించడానికి విద్య ఒకటే సాధనం. విద్య సామాజిక గౌరవాన్ని పెంచుతుంది. సాధికారతను ఇస్తుంది. విద్యకున్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రభుత్వం విద్యారంగాన్ని పటిష్టపరుస్తున్నది. నేను ఇంతకుముందే ప్రస్తావించినట్లు వివిధ శాఖలకు కేటాయించిన నిధుల ద్వారా పెద్ద ఎత్తున రెసిడెన్షియల్ స్కూళ్లను స్థాపిస్తున్నాం. విద్యారంగ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం. ఉస్మానియా యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నాం. ఉస్మానియా సెంటినరీ బ్లాక్ నిర్మాణానికి మరియు ఉత్సవ నిర్వహణకు రూ.200 కోట్లను కేటాయిస్తున్నాం. అంతేకాక, ఇతర విశ్వవిద్యాలయాల మౌళిక వసతుల మెరుగుకు రూ.200 కోట్లు కేటాయించడం జరిగింది. విద్యాశాఖ కోసం ఈ ఏడాది బడ్జెట్లో రూ.12,705.72 కేటాయించాం. కేవలం విద్యాశాఖ ద్వారా మాత్రమే కాకుండా వివిధ శాఖల ద్వారా విద్యారంగం కోసం ఖర్చుపెడుతున్నామనే విషయాన్ని కూడా గమనించాలని కోరుతున్నాను.

**పంచాయితీ రాజ్:**

59. స్థానిక సంస్థలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. రాష్ట్రంలో పంచాయితీల ద్వారా పన్నుల వసూళ్లు మెరుగయ్యాయి. దీనివల్ల గ్రామ పంచాయితీలు గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతున్నాయి. సర్పంచ్‌లు, ఎంపిటిసీలు, ఎంపిపిలు, జడ్పిటిసిలకిచ్చే గౌరవ వేతనాన్ని గణనీయంగా పెంచిన విషయం గౌరవ సభ్యులకు గుర్తుచేస్తున్నాను. పంచాయితీ రాజ్ శాఖ ద్వారా రాష్ట్రంలోని మొరం, మట్టిరోడ్లను బిటి రోడ్లుగా మారుస్తున్నాం. బిటి రోడ్లకు మరమ్మతులు చేస్తున్నాం. పంచాయితీ రాజ్ శాఖకు ఈ బడ్జెట్లో రూ.14,723.42 కేటాయిస్తున్నాం.

**పట్టణాభివృద్ధి :**

60. తెలంగాణ రాష్ట్రంలో పట్టణ జనాభా రోజురోజుకూ పెరుగుతున్నది. తెలంగాణ జనాభాలో 40 శాతానికి పైగా జనం పట్టణాల్లోనే నివాసం ఉంటున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పట్టణ జనాభాలో 20 శాతం మంది హైదరాబాద్ నగరంలోనే నివసిస్తు న్నారు. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించ డమే ప్రభుత్వం ముందున్న పెద్ద సవాల్. ఈ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో కృషి చేస్తున్నది. పట్టణ ప్రాంతాల్లో తక్షణావసరాలైన సదుపాయాలు కల్పించడా నికి ప్రాధాన్యత ఇస్తున్నది. ఇందుకోసం హైదరాబాద్ నగరంతోపాటు ఇతర నగరాలు, పట్టణాల అభివృద్ధికి బడ్జెట్లో ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నాం. జి.హెచ్. ఏం.సికి రూ.1000 కోట్లు, గ్రేటర్ వరంగల్ కు రూ.300 కోట్లు, మిగతా మున్సిపల్ కార్పొరేషన్లకు రూ.400 కోట్లు ఈ బడ్జెట్లో నిధులు కేటాయిస్తున్నాం. మూసీనదీ తీరప్రాంతం అభివృద్ధికి రూ.350 కోట్లు కేటాయిస్తున్నాం.

మొత్తం మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు రూ.5,599 కోట్లు కేటాయిస్తున్నాం.

61. వీటితో పాటు బడ్జెటేతర మార్గాలలో నిధులను సమీకరించి, పట్టణప్రాంతా లలో ఖర్చు పెట్టడం జరుగుతుంది. హైదరాబాద్ మహా నగరంలో పెరుగుతున్న జనా భాకు అనుగుణంగా మౌళికసౌకర్యాల కల్పనలేదు. వర్షాకాలంలో వరదలు మరియు నీటి నిలువ కారణంగా రహదారి వ్యవస్థ ఛిన్నాభిన్నమై జనజీవనం స్తంభించిపోతుంది. ఈ సమస్యలను అధిగమించడానికి పట్టణ మౌళికసదుపాయాల అభివృద్ధి సంస్థ ద్వారా హై దరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో రహదారుల అభివృద్ధి మరియు వరద నీరు పారుదల వ్యవస్థను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

**మిషన్ భగీరథ:**

62. ప్రతి ఇంటికి నల్లా ద్వారా ప్రతి రోజు సురక్షిత మంచినీరు అందివ్వాలనే బృహత్తర లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం అను

కున్న వేగంతో పూర్తవుతున్నది. డిసెంబర్ 2017 నాటికి అన్ని గ్రామాలకు నదీ జలాలు చేరే విధంగా కార్యచరణ అమలవుతున్నది. ఆపై ప్రతీ ఇంటికి నల్లా ద్వారా గోదావరి, కృష్ణ జలాలు అందుతాయి. రాష్ట్రంలోని 24,248 గ్రామీణ ఆవాస ప్రాంతాల్లోని 52,18,225 కుటుంబాలకు స్వచ్ఛమైన తాగునీరు లభ్యమవుతుంది. 65 మున్సిపాలిటీలలోని 12.52 లక్షల కుటుంబాలకు, ఓఆర్ఆర్ లోపల ఉన్న గ్రామాలకు ఇదే పథకం ద్వారా మంచినీరు లభిస్తుంది. ప్రతి ఇంటికి ప్రతీరోజు మనిషికి గ్రామీణ ప్రాంతాల్లో వందలీటర్ల నీరు, మున్సిపాలిటీల్లో 135 లీటర్లు, మున్సిపల్ కార్పొరేషన్లలో 150 లీటర్ల నీరు అందిస్తారు. బడ్జెట్‌పై పెద్దగా భారం పడకుండానే బడ్జెటేతర నిధులతో ఈ పథకాన్ని పూర్తి చేస్తున్నాం. ఈ పథకానికి బడ్జెట్ సపోర్టు క్రింద రూ.3,000 కోట్లు కేటాయిస్తున్నాం.

**రహదారులు:**

63. రహదారుల నిర్మాణంలో గతంలో ప్రభుత్వాలకు ఓ విధానమంటూ లేదు. తెలంగాణ ఏర్పాటుకు పదమూడేళ్ల ముందు రహదారుల నిర్మాణం, మరమ్మత్తులో స్తంభన ఏర్పడింది. ప్రయాణం, రవాణా సాఫీగా సురక్షితంగా లేక ప్రజలు ఎంతో నష్టపోయారు. మా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తెలంగాణ భౌగోళిక స్థితిగతులకు అనుగుణంగా రహదారుల నిర్మాణం కోసం సమగ్ర విధాన కల్పన చేసింది. ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రానికి ఖచ్చితంగా పక్కా రోడ్డు, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ లేన్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర రాజధానికి ఫోర్ లేన్ రోడ్డు ఉండే ప్రణాళిక అమలు చేస్తున్నది. పంచాయతీ రాజ్ పరిధిలో రూ.2247.28 కోట్ల వ్యయంతో 14,689 కిలో మీటర్ల మేర బిటి రోడ్లకు మరమ్మత్తులు చేశాము. రూ.4,564 కోట్ల వ్యయంతో 8987 కిలో మీటర్ల మేర రహదారుల వెడల్పు, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రూ.891 కోట్ల వ్యయంతో 460 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతున్నది.

64. ఆర్ అండ్ బి పరిధిలో రూ.1550 కోట్ల వ్యయంతో 5150 కిలో మీటర్ల మేర బిటి రోడ్లకు మరమ్మత్తులు చేసింది. రూ 4100 కోట్ల వ్యయంతో 2850 కిలో మీటర్ల

మేర రోడ్ల వెడల్పు, అభివృద్ధి చేసింది. రూ 2782 కోట్ల వ్యయంతో 512 బ్రిడ్జిల నిర్మాణం జరుగుతున్నది.

65. తెలంగాణ రాష్ట్రంలో నూతన జాతీయ రహదారుల నిర్మాణానికి నిధులు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం గణనీయమైన విజయం సాధించింది. గత ఏడు దశాబ్దాలలో మన తెలంగాణలో నిర్మించిన జాతీయ రహదారి కేవలం 2,527 కిలోమీటర్లయితే, ఇప్పుడు ఈ రెండున్నరేళ్లలో తెలంగాణ ప్రభుత్వం సాధించింది 2,776 కిలో మీటర్లు. అంటే ఏడు దశాబ్దాల్లో సాధించిన హైవేలకన్నా ఎక్కువ హైవేలను కేవలం రెండున్నర ఏళ్ల తక్కువ కాలంలో ప్రభుత్వం సాధించింది. దీంతో రాష్ట్రంలో జాతీయ రహదారుల పొడవు 5,303 కిలో మీటర్లకు పెరిగింది. ప్రతి వంద చ.కి.మీ లకు జాతీయ సగటు 3.81 కిలో మీటర్లయితే, తెలంగాణ సగటు 4.62 కిలోమీటర్లు. రోడ్ల నిర్మాణానికి ఈ బడ్జెట్లో రూ.5,033.64 కేటాయిస్తున్నాం.

**విద్యుత్:**

66. యాభై ఎనిమిది ఏండ్ల సమైక్యపాలన చీకట్లను తొలగిస్తూ ఉదయించిన తెలంగాణ వెలుగులవైపు ప్రయాణిస్తున్నది. విద్యుత్ సరఫరాలో సాధించిన అపూర్వమైన ప్రగతే అందుకు తార్కాణం. గత యాభై ఎనిమిది ఏండ్లలో ఎన్నడూ ఏ ప్రభుత్వం నేటి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్నట్లు విద్యుత్‌ను ప్రజలకు అందించలేదు. సమైక్య రాష్ట్రంలో కోతలు లేని కరెంటు ఒక తీరని కల. నేడది ప్రజల నిత్య అనుభవం.

67. మా ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే విద్యుత్ పరిస్థితిని పూర్తిగా మార్చివేసింది. అనతికాలంలోనే అద్భుతాన్ని ఆవిష్కరించింది. గతంలో కరెంటు ఉంటే వార్త. నేడు కరెంటు పోతే వార్త. కరెంటు కోతలకు కాలం చెల్లింది. నిరంతర విద్యుత్‌తో తెలంగాణ వెలుగులు విరజిమ్ముతున్నది. నేడు వ్యవసాయానికి పగటిపూట 9 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయగలుగుతున్నామని సగర్వంగా ప్రకటిస్తున్నాను. ఈ

వేసవిలో విద్యుత్ డిమాండ్ 9,500 నుంచి 10 వేల మెగావాట్లకు చేరుకున్నా సమర్థ వంతంగా సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖ సంసిద్ధంగా ఉంది. మెరుగైన విద్యుత్ సర ఫరాతో ప్రగతి దిశగా మా ప్రభుత్వం గొప్ప ముందడుగు వేసింది. పల్లెల్లో, పట్టణాల్లో పరిస్థితి మెరుగై నిరాశ నిస్పృహ తొలగి ఉత్సాహపూరిత వాతావరణం నెలకొన్నది.

68. విద్యుత్ ఉత్పత్తిలో దీర్ఘకాలిక ప్రణాళికతో ప్రభుత్వం కార్యాచరణను చేపట్టింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి ఉన్న విద్యుత్ సామర్థ్యం 6,574 మెగా వాట్లు. ఈ రెండున్నరేళ్ళలో అదనంగా 4190 మెగావాట్ల విద్యుత్ సమకూరింది. ఈ ఏడాది చివరి వరకు మరో 4,130 మెగావాట్ల విద్యుత్ అందుతుంది. రాబోయే మూడేళ్లలో మొత్తం 16,306 మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వస్తుంది. పాల్వంచ కె.టి.పి.ఎస్‌లో 800 మెగావాట్లు, చత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మెగావాట్లు, భద్రాద్రి పవర్ ప్లాంటు నుంచి 1080 మెగావాట్లు, ఎన్.టి.పి.సి ద్వారా 4 వేల మెగావాట్లు, సింగరేణి ద్వారా 800 మెగావాట్లు, యాదాద్రి పవర్‌స్టేషన్ ద్వారా 4 వేల మెగావాట్లు, సి.జీ.ఎస్ ద్వారా 809 మెగావాట్లు, సోలార్ ద్వారా 3727 మెగావాట్లు, 90 మెగావాట్ల హైడల్ పవర్ అందుబాటులోకి రానుంది. వార్ధా-డిచ్‌పల్లి లైను నిర్మాణం పూర్తయింది. దీని ద్వారా రెండు వేల మెగావాట్ల విద్యుత్‌ను నార్తన్ గ్రిడ్ నుంచి పొందే అవకాశం కలిగింది. దేశంలో ఎక్కడ విద్యుత్ అందుబాటులో ఉన్నా మనం దాన్ని పొందేందుకు ఈ లైన్ ద్వారా సాధ్యమవుతుంది. లోటు విద్యుత్‌తో మొదలైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా మిగులు విద్యుత్ రాష్ట్రంగా మారబోతున్నది. విద్యుత్ డిస్కమ్‌లకు ఆర్థిక వెసులుబాటు కల్పించడానికి ఆ సంస్థల మొత్తం రూ.11,897 కోట్ల అప్పులో 75 శాతం (రూ.8,923 కోట్లు) అప్పును కేంద్ర ప్రభుత్వ ఉదయ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం స్వీకరించింది. దీనివల్ల డిస్కమ్‌లకు ప్రతి ఏటా రూ.890 కోట్ల వడ్డీ భారం తగ్గుతుంది. విద్యుత్ శాఖకు ఈ బడ్జెట్లో రూ.4,203.21 కోట్లు కేటాయిస్తున్నాం.

**హరితహారం:**

69. రాష్ట్రంలో అడవుల విస్తీర్ణాన్ని 24 శాతం నుంచి 33 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం పథకం కింద 230 కోట్ల మొక్కలను నాటే ప్రణాళిక ప్రారంభించాం. ఇప్పటికే 47.53 కోట్ల మొక్కలను నాటాము. మరో 40 కోట్ల మొక్కలను 2017-18 లో నాటుతాము. హరితహారానికి ఈ బడ్జెట్‌లో రూ.50 కోట్లు కేటాయించాం.

**పరిశ్రమలు:**

70. రెండున్నరేళ్ల చిన్న వయస్సున్న తెలంగాణ రాష్ట్రం సులభతర వాణిజ్య విధానంలో దేశంలోనే నెంబర్ వన్ ర్యాంకును చేజిక్కించుకున్నది. సింగిల్ విండో విత్ఔట్ గ్రిల్స్ అనే నినాదంతో మా ప్రభుత్వం రూపొందించిన టిఎస్-ఐపాస్ చట్టం తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి బంగారు బాటలు వేసింది. 15 రోజుల్లోనే పారిశ్రామిక అనుమతులిస్తున్నాం. నిర్ణీత వ్యవధిలోపు అనుమతుల ప్రక్రియ పూర్తికాకపోతే స్వీయ ధృవీకరణతో అనుమతి పొందే వీలుకల్పించాం. దీంతో రాష్ట్రంలో అప్పటిదాకా కొనసాగిన లైసెన్స్ రాజ్‌కు ప్రభుత్వం చరమగీతం పాడింది. సెల్‌ఫోన్లు ఉత్పత్తి చేసే ఒక విఖ్యాత బహుళజాతి సంస్థ తెలంగాణ రాష్ట్రంలో తమ యూనిట్ స్థాపన విషయంలో ఎక్కడా తమకు అవినీతికానీ, అలసత్వంకానీ, ఆలస్యంకానీ, ఏ అడ్డంకులూ ఎదురు కాలేదని ఇది తమకెంతో ఆశ్చర్యాన్నీ, ఆనందాన్ని కలిగించిందనీ మా ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ సందేశం పంపింది. అనుమతులు పొందే ప్రక్రియ పారదర్శకంగా, సరళతరంగా, అవినీతి రహితంగా సాగుతుందనేందుకు ఇదొక మచ్చుతునక.

71. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండున్నరేళ్ల కాలంలో 2.20 లక్షల మందికి ఉపాధిని కల్పించే విధంగా, రూ.58,341 కోట్ల పెట్టుబడులతో 3,451 పరిశ్రమలకు అనుమతులు ఇవ్వడం జరిగింది. వీటిలో 1,097

పరిశ్రమలు తమ ఉత్పత్తులను ప్రారంభించి 43,075 మందికి ఉపాధి కల్పించడం జరిగింది. ఈ పరిశ్రమలలో బోయింగ్, ఐ.టి.సి, టాటా సికోర్స్కి, హెచ్.ఎస్.ఐ.ఎల్, తోషిబా మరియు మైక్రోమాక్స్ వంటి సుప్రసిద్ధ సంస్థలు కూడా ఉన్నాయి. పరిశ్రమల శాఖకు ఈ బడ్జెట్లో రూ.985.15 కేటాయిస్తున్నాం.

**ఐటి మరియు కమ్యూనికేషన్స్:**

72. తెలంగాణ రాష్ట్రం ఐ.టి రంగంలో దూసుకుపోతున్నది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం కారణంగా ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ఎన్నోదిగ్గజ సంస్థలు హైదరాబాద్ నగరంలో తమ యూనిట్లు ప్రారంభిస్తున్నాయి. ఐటి ఎగుమతుల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలో 12 శాతం వాటా కలిగి రెండవ స్థానాన్ని ఆక్రమించింది. గత ఏడాది ఐటి ఎగుమతుల విలువ 75,070 కోట్ల రూపాయలు. తెలంగాణలోని ఐటి కంపెనీల ద్వారా దాదాపు నాలుగు లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభించాయి.

73. తెలంగాణ ప్రభుత్వం ఐటి పరిశ్రమను ప్రోత్సహించడానికి ఐసిటి పాలసీని, ఎలక్ట్రానిక్స్ పాలసీని, యానిమేషన్-గేమింగ్ పరిశ్రమ కోసం ఇమేజ్ పాలసీని, ఇన్నోవేషన్ పాలసీని, రూరల్ టెక్నాలజీ పాలసీని, డాటా సెంటర్స్ పాలసీని, ఓపెన్ డాటా పాలసీని, సైబర్ సెక్యూరిటీ పాలసీని రూపొందించాం. ఐటి శాఖకు ఈ బడ్జెట్లో రూ.252.89 కోట్లు కేటాయించాం.

**శాంతి భద్రతలు:**

74. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నది. ప్రజల జీవితానికి భద్రత కల్పించడంతో పాటు, రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించడానికి ఈ అంశం దోహదపడుతున్నది. తెలంగాణలో పోలీసు శాఖ ఆధునీకరణకు, సిబ్బంది జీవన ప్రమాణాలను పెంచడానికి, వారికి సరైన శిక్షణ అందివ్వడానికి, ఆధునిక సాంకేతిక

పరిజ్ఞానాన్ని అందివ్వడానికి, ఆధునిక వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నది. రాష్ట్రంలో మహిళల రక్షణ కోసం షి టీమ్స్ విజయవంతంగా పనిచేస్తున్నాయి. రాష్ట్రంలో గుడుంబా నివారణకు ప్రభుత్వం ద్విముఖ వ్యూహం అనుసరిస్తున్నది. గుడుంబా తయారీ, అమ్మకాలను నిరోధించడంతో పాటు, గుడుంబా తయారు చేసే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తున్నది. రాష్ట్రంలో గుడుంబా మహమ్మారిని పారద్రోలేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిచ్చాయి. పోలీసు శాఖ సమర్థత పెరగడంతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రకాల నేరాలు తగ్గుముఖం పట్టాయి. ఈ బడ్జెట్లో పోలీసు శాఖకు రూ.4,828.18 కోట్లు కేటాయిస్తున్నాం.

**పర్యాటక, సాంస్కృతిక రంగం:**

75. తెలంగాణలోని పర్యాటక కేంద్రాలు, యాత్రాస్థలాలు సమైక్య రాష్ట్రంలో ఎంతో అలక్ష్యానికి గురయ్యాయి. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత పర్యాటక కేంద్రాలు అభివృద్ధికి నోచుకుంటున్నాయి. రాష్ట్రానికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతున్నది. పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం క్రియాశీల నిర్ణయాలు తీసుకున్నది. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు టూరిస్టు సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసింది. హెరిటేజ్ వాక్ వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌కు మన రాష్ట్రం ఆతిధ్యం ఇచ్చింది. పర్యాటక రంగంతో పాటు సాంస్కృతిక వికాసానికి కూడా ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నది.

76. పర్యాటక, సాంస్కృతిక శాఖకు ఈ బడ్జెట్లో రూ.198.03 కోట్లు కేటాయించింది.

**2015-16 అకౌంట్లు:**

77. 2015-16 సంవత్సరంలో అకౌంటెంట్ జనరల్ గారు ధృవీకరించిన లెక్కల ప్రకారం రూ.238.09 రెవెన్యూ మిగులు తేలింది. ద్రవ్యలోటు రూ.18,856.15 కోట్లు, ఇది జి.ఎస్.డి.పి. లో 3.21 శాతం. ద్రవ్యలోటు ఎఫ్.ఆర్.బి.ఎమ్. నిర్దేశించిన పరిధిలోనే ఉన్నది. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.97,922.87 కోట్లు ఖర్చు అయ్యింది.

**సవరించిన అంచనాలు 2016-17:**

78. 2016-17 సంవత్సరపు సవరించిన అంచనాలని బట్టి రూ.1,12,191.07 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశాము. ఇది బడ్జెట్ అంచనాలలో 86.02 శాతం. కేంద్ర నుండి రావలసిన ప్రణాళికా నిధులు తగ్గాయి. కోర్టు వ్యాజ్యాల కారణంగా భూముల అమ్మకం జరగలేదు. వాణిజ్య పన్నుల ద్వారా రావలసిన బకాయిలు కోర్టు కేసుల కారణంగా వసూలవలేదు. నోట్ల రద్దు వల్ల ఆదాయం తగ్గింది. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వం చేతిలో లేని అంశాలు. 2016-17 సంవత్సరపు సవరించిన అంచనాల ప్రకారం రూ.199.40 కోట్ల రెవెన్యూ మిగులు ఉన్నది. రూ.21,892.83 కోట్ల ద్రవ్య లోటు ఉంటుందని అంచనా వేశాము.

**బడ్జెట్ అంచనాలు 2017-18:**

79. 2016-17 సంవరించిన అంచనాల ప్రకారం తెలంగాణ రాష్ట్ర సొంత ఆదాయం. రూ.58,636 కోట్లు కాగా 2017-18 లో రాష్ట్ర సొంత ఆదాయాన్ని రూ.69,220.37 కోట్లు గా అంచనా వేస్తున్నాం. కేంద్ర వితరణ కింద వచ్చే నిధులు, 2016-17 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.28,433.78 కోట్లు కాగా 2017-18 బడ్జె ట్ లో రూ.43,862.67 కోట్లను ప్రతిపాదించడమైనది. కేంద్రం నుంచి వచ్చే నిధుల్లో నామ మాత్రపు పెరుగుదల కనిపిస్తున్నది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో

రూ.1,49,646.00 కోట్ల వ్యయాన్ని ప్రతిపాదిస్తున్నాము. దీనిలో నిర్వహణ వ్యయం కింద రూ.61,607.20 కోట్లు, ప్రగతి పద్దు కింద రూ.88,038.80 కోట్లు ప్రతిపాదిస్తు న్నాము. నిర్వహణ వ్యయం కంటే ప్రగతి పద్దు వ్యయం ఎక్కువగా ఉండడం అపూర్వం. నిర్వహణ వ్యయంలో ఎక్కువగా రాజీ పడకుండా దీనిని చేసి చూపాము. వనరులను బలోపేతం చేసి, వ్యయాన్ని సహేతుకంగా క్రమబద్ధీకరించడం ద్వారా ఇది సాధ్యమ య్యింది. జి.ఎస్.డి.పి.ని అంచనా వేసేందుకు కేంద్ర ప్రభుత్వం 2011-12 ను బేస్ ఇయర్‌గా స్వీకరించింది. కాబట్టి ఎఫ్.ఆర్.బి.ఎమ్. చట్ట ప్రకారం 2017-18 సంవత్స రంలో ఋణ పరిమితి కొంత పెరగవచ్చని అంచనా వేస్తున్నాము.

80. 2017-18 సంవత్సరపు బడ్జెట్‌లో రెవెన్యూ మిగులు రూ.4,571.30 కోట్లు, ద్రవ్యలోటు రూ.26,096.31 కోట్లు ఉండగలదని అంచనా వేస్తున్నాము. ఈ ద్రవ్య లోటు మన రాష్ట్ర స్థూల ఉత్పత్తి లో 3.48 శాతంగా అంచనా వేయటం జరిగింది. సాగు నీటి రంగానికి కేటాయించిన నిధులను నిర్మాణ వ్యయంగా పరిగణించడం వల్ల రెవెన్యూ మిగులు అధికంగా అంచనా వేయబడింది.

81. ముందు చెప్పిన విధంగా ప్రభుత్వ పథకాలను అమలుపరిచే కార్పొరేషన్‌లకు బడ్జెటేతర పద్ధతులలో నిధులను సమకూర్చడం జరుగుతున్నది. బడ్జెట్‌లోని కేటా యింపుతో పాటు ఆయా కార్పొరేషన్‌లకు గల స్వంత ఆదాయవనరుల ద్వారా సమకూ ర్చుకొనే బడ్జెటేతర నిధులతో కల్పి చూసినట్లయితే 2017-18 ఆర్థిక సంవత్సరంలో వ్యయం చాలా ఎక్కువగా ఉంటుందని గౌరవ సభ్యుల దృష్టికి తెస్తున్నాను.

**ముగింపు:**

82. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అనేక విషయాల్లో దేశానికి ఆదర్శంగా నిల వడం మనందరికి గర్వకారణం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ లాంటి కార్యక్రమా లను నీతి ఆయోగ్ ప్రశంసించడమే కాకుండా ఇతర రాష్ట్రాలు కూడా ఇలాంటి కార్యక్ర మాలు అమలు చేయాలని సూచించింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ లో తెలంగాణ

రాష్ట్రం నెంబర్ వన్ స్థానంలో నిలిచింది. తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలను కేంద్రప్రభుత్వం అనేక సార్లు అభినందించింది. అవార్డులు ప్రకటించింది. అభివృద్ధిలో మన రాష్ట్రం మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. ౩౦ కి పైగా ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తూ బడ్జెట్‌లో సింహభాగం కేటాయింపులు జరుపుతూ సంక్షేమ రంగంలో మనం దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం.

౮౩. అభివృద్ధి నమూనా అంటే ఇప్పటివరకు కేరళ, గుజరాత్‌ల గురించి దేశం మాట్లాడేది. కానీ అతికొద్ది సమయంలోనే తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందనే నమ్మకం నాకున్నది.

౮౪. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని ప్రజాభ్యుదయం కోసం అర్థవంతంగా, సమర్థవంతంగా నిర్వహించే సృజనాత్మక ఆర్థిక ప్రణాళికేయే బడ్జెట్. వందల కోట్లు వచ్చిపడినా పరిపాలన దక్షత, అంకిత భావం లేకపోతే ప్రజాధనం నిరర్థకమైపోతుంది. వృథా వ్యయానికి అసంగత విధానాలకు స్వస్తి చెప్పి ప్రజా జీవన వికాసమే గీటురాయిగా కూర్చిన ఆర్థిక ప్రణాళిక ఇది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుత్తేజం ఇచ్చి కులవృత్తులకు ఆదరువుగా నిలిచి, కూలిన జీవితాలను నిలబెట్టేదే బడ్జెట్. జానెడు పొట్ట నింపుకోవడం కోసం ఊరు జాడలు మరిచి, తల్లిదండ్రులను విడిచి, భార్యాబిడ్డలకు దూరమై దూరదేశాలలో దుఃఖం వెళ్లదీస్తున్న తెలంగాణ బిడ్డలు తిరిగి పల్లెకు పయనం కావాలన్నదే మా ఆకాంక్ష. మైగ్రేషన్ నుంచి రివర్స్ మైగ్రేషన్ దిశగా తెలంగాణ ప్రస్థానం సాగేందుకు ఈ బడ్జెట్ దిక్సూచిగా నిలుస్తుందని భావిస్తున్నాను.

౮౫. అన్నార్తులు అనాథలుండని ఆ నవయుగాన్ని సాధించేందుకు కరువంటూ కాటకమంటూ కనిపించని తీరాలకు తెలంగాణను చేర్చడానికి గౌరవ ముఖ్యమంత్రి గారి నాయకత్వంలో మేము అలుపెరగకుండా పరిశ్రమిస్తాం. బంగారు తెలంగాణ సాధన దిశలో ప్రవేశపెడుతున్న బడ్జెట్‌ను ఆమోదించాలని కోరుతున్నాను.

జైహింద్

జై తెలంగాణ